నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 4 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సైబర్ నేరాలకు పాల్పడుతున్న భార్యాభర్తల అరెస్టు

మంచిర్యాల అర్బన్, నవంబర్ 3 : తెలుగు మాట్రిమోని పేరిట సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లాకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, ముత్తారం మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన రామచంద్ర సౌజన్య భార్యా భర్తలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు రామగుండం సైబర్ క్రైం ఏసీపీ వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన ఒకరు వీరి చేతిలో చిక్కుకుని రూ.17లక్షలు కోల్పోయినట్లు రామగుండం సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌హెచ్‌వో సీఐ కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించినట్లు తెలిపాడు. నిందుతులిద్దరు కలిసి తెలుగు మ్యాట్రిమోనీ డాట్ కామ్ పేరిట వెబ్‌సైట్‌లో వారి ఫోన్ నంబర్లు, అమ్మాయిల పేరిట ఫేక్ ప్రొఫైల్ క్రియేట్ చేసి అందమైన అమ్మాయిల ఫొటోలు అప్‌లోడ్ చేస్తూ అబ్బాయిలకు రిక్వెస్టులు పెడుతున్నారు. వాటికి స్పందించిన అబ్బాయిలను మాయమాటల్లో పెట్టి వారి వద్ద నుంచి ఆరోగ్యం బాగో లేదని తదితర కారణాలు చెబుతూ పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కోలుకోని ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- విద్యార్థుల ఆరోగ్యంపై క్లారిటీ ఇవ్వని అధికారులు
- తాజాగా దవాఖానకు మరో ఇద్దరు విద్యార్థినుల రెఫర్

వాంకిడి, నవంబర్ 3 : గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో బుధవారం 30 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరుతున్న విద్యార్థినీల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది. ఐదు రోజులు గడుస్తున్నా విద్యార్థుల ఆరోగ్యం కుదుట పడలేదు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 13 మందిచ ఆసిఫాబా ద్ సర్కారు, ప్రైవేటు దవాఖానాల్లో 15 మంది, మంచిర్యాలలో నలుగురు చికిత్స పొందుతున్నారు. దీనికితోడు ఆదివారం మరో ఇద్దరిని రెఫర్ చేసినట్లు తెలుస్తున్నది. విద్యార్థుల అనారోగ్యానికి గల కారణాలు, వారి ఆరోగ్య పరిస్థితులపై హాస్టల్ సిబ్బంది క్లారిటీ ఇవ్వకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పిల్లల ఆరోగ్యంపై హాస్టల్ సిబ్బంది ఒక్కొక్కరుగా ఒక్కో తీరుగా సమాధానం ఇస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మంచిర్యాలలోని మాక్స్ కేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థిని శైలజ పరిస్థితి విషమంగా మారడంతో ఆమెను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మెరుగైన వైద్యం అందించాలి..

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

మంచిర్యాల అర్బన్/వాంకిడి, నవంబర్ 3 : ఫుడ్ పాయిజన్ అయిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచించారు. గత నెల 31న వాంకిడి మండలంలోని గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. వీరిని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే ఆసుపత్రికి వచ్చి విద్యార్థుల ఆరోగ్యం గురించి ఆరా తీశారు. వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. ధైర్యంగా ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. ఇద్దరు విద్యార్థులకు మెరుగైన వైద్యం అవసరం ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు తెలిసింది.

పలు కార్యక్రమాలకు హాజరు

రెబ్బెన, నవంబర్ 3 : రెబ్బెన మండలంలోని పలు కార్యక్రమాలకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హాజరయ్యారు. గోలేటిలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు ఇంట్లో నిర్వహించిన సత్యనారాయణస్వామి వ్రతానికి, బీఆర్ఎస్ కార్యకర్త గణేశ్ కుమార్తె సారీ ఫంక్షన్‌కు, రెబ్బెన లో పీఏసీఎస్ డైరక్టర్ వెంకటేశ్వర్‌గౌడ్ తల్లి సంవత్సరీకానికి హాజరయ్యారు.

గురువులతో విష్ణుశివానికేతన్ పూర్వవిద్యార్థులు

అ'పూర్వ'సమ్మేళనం

తాండూర్, నవంబర్ 3 : మండల కేంద్రంలోని విష్ణుశివానికేతన్ పాఠశాలలో పదో తరగతి (2004-05)బ్యాచ్ పూర్వ విద్యార్థులు సురభి గోదాక్షేత్ర గార్డెన్స్‌లో ఆదివారం అ'పూర్వ'సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి స్నేహితులు ఒకే వేదికపై చేరి యోగక్షేమాలు తెలుసుకుని తమ ఆత్మీయతను పంచుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను, తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా మిత్రులు అలనాడు చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందోత్సాహాల్లో మునిగిపోయి ఆటాపాటలతో సందడి చేసారు. అనంతరం అప్పటి గురువులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

గూడెం గుట్టపై శ్రీసత్యనారాయణ స్వామి ఆలయం

గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ ప్రధాన ద్వారం

ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు(ఫైల్)

కార్తీకం.. శుభప్రదం

- కార్తీక పూజలకు కేరాఫ్ గూడెం గుట్ట
- ఆలయం వద్ద నెలంతా భక్తుల సందడి
- సత్యనారాయణస్వామి వ్రతాలకు నెలవు
- ప్రారంభమైన కార్తీక మాసం

కార్తీక మాసం అంటేనే పూజలు, శుభకార్యాలు, వ్రతాలకు ప్రత్యేకం. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తే పుణ్యఫలం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మరి కొందరు నదీ స్నానాలు, ఆలయ దర్శనాలు చేస్తుంటారు. వాటన్నింటిని ఒకేచోట పొందేందుకు కార్తీక మాస పూజల కోసం దండేపల్లి మండలంలోని గూడెం గుట్ట వేదికవుతుంది. ఇక్కడ వెలిసిన శ్రీసత్యనారాయణ స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులవుతారు. ఈ మాసంలో తులసి పూజను దైవరూపంగా భావిస్తారు. ఈ మొక్కను పూజిస్తే సకల దోశాలు, పాపాలు తొలిగిపోతాయని భక్తుల నమ్మకం.

దండేపల్లి, నవంబర్ 3 : మండలంలోని గూడెం గ్రామంలో ఉన్న ఆలయాల్లో శనివారం నుంచి కార్తీక సందడి ప్రారంభమైంది. గూడెంలో ఉన్న శ్రీసత్యనారాయణస్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా, అంజనేయస్వామి దేవస్థానం, శనేశ్వరాలయం, సదానందస్వామి ఆలయాలు కార్తీక మాసంలో భక్తుల రద్దీతో సందడిగా మారనున్నాయి. గూడెం గుట్టకు అతి సమీపంలోనే పవిత్ర గోదావరి ప్రవహిస్తుండడంతో భక్తుల తాకిడి పెరుగుతూ ఉంటుంది. కరీంనగర్-జగిత్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ఆలయాలు ఉండడంతో పుణ్య క్షేత్రాలకు శోభ చేకూరుతుంది. కార్తీక మాసంలో మహిళలు వ్రతాలు, నోములు ఆచరిస్తారు. కార్తీక దీపారాధనకు ప్రాధాన్యత ఉంది.

నెలంతా భక్తుల సందడి

తెలంగాణలోనే ప్రసిద్ధి చెందిన గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రతినిత్యంతోపాటు కార్తీక మాసంలో రెట్టింపు సంఖ్యలో భక్తులు వస్తుంటారు. దీంతో ఈ మాసంలో ఆలయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆలయానికి కొద్ది దూరంలో ఉన్న పవిత్ర గోదావరి భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలి, గంగమ్మ తల్లికి పూజలు చేస్తుంటారు. సత్యదేవుని దర్శనం, అభిషేక పూజలు చేస్తుంటారు. సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల తోపాటు, స్వామివారి సన్నిధికి సమీపంలో ఉన్న రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తుంటారు. కార్తీక పౌర్ణమి రోజున ఆలయంలో పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తుంటారు.

అయ్యప్ప, సాయిబాబా ఆలయాలు

సత్యదేవుని ఆలయ సమీపంలో మరో గుట్టపై ఆలయం, గుట్ట కింద సాయిబాబా ఆలయం ఉంది. అయ్యప్ప దీక్షలు కూడా ఈ మాసంలోనే ప్రారంభం అవుతాయి. కాబట్టి దీక్ష తీసుకునే వారు కూడా చాలా మంది అయ్యప్ప ఆలయానికి వచ్చి మాలధారణ చేసుకుంటారు. కార్తీక మాసంలో షిర్డీ సాయిబాబా ఆలయంలో సందడి నెలకుని ఉంటుంది.

గూడెంలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు

రమాసహిత శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 15 వరకు కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 13న విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనము, అంకురారోపణము, అగ్ని ప్రతిష్ట, నిత్యవహనము, బలిహరణం, తీర్థప్రసాద వితరణ, గోధూళిక సుముహూర్తాన తులసీ కల్యాణం 14న నిత్యహవణము, బలిహరణము, తీర్థప్రసాద వితరణ, 15న నిత్యహవణము, బలిహరణము, తీర్థప్రసాద వితరణ, కార్తీక పౌర్ణమి జాతర, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, మహా పూర్ణాహుతి హోమం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు(ఫైల్)

ఎమ్మెల్యే గారూ.. మాకూ మహాలక్ష్మి కావాలి

- ఉచిత బస్సు ప్రయాణానికి నోచుకోని పది పల్లెలు
- రోడ్డు బాగున్నా బస్సులను నడపని ఆర్టీసీ అధికారులు
- అధికారుల సమన్వయలోపం.. ప్రజలకు శాపం..
- ఎనిమిది నెలలుగా ఆర్థికంగా నష్టపోతున్న ప్రయాణికులు
- బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న ప్రజలు

మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెపుతున్నా మాటలు నీటి మూటలవుతున్నాయి. కేవలం పట్టణాల వైపు మాత్రమే ఆర్టీసీ బస్సులను నడిపిస్తూ పల్లెలను విస్మరిస్తుండడంపై ఆ గ్రామాలు మహాలక్ష్మీ పథకానికి నోచుకోవడం లేదు. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా ఎనిమిది నెలల నుంచి ఆ గ్రామాలకు ఆర్టీసీ సేవలు నిలిచిపోవడంతో అక్కాచెల్లెళ్లు, అమ్మలకు ప్రైవేట్ వాహనాలే పెద్ద దిక్కుగా మారుతున్నాయి. కోటపల్లి మండలంలోని పారుపల్లి నుంచి వెంచపల్లి మార్గంలో ఆర్టీసీ సేవలు ఎనిమిది నెలలుగా నిలిచిపోయాయి. ఈ మార్గంలో ఉన్న పది గ్రామాల ప్రజలు ప్రైవేట్ వాహనాల్లో రెట్టింపు చార్జీలు చెల్లిస్తూ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం చేస్తున్నారు.

బస్సు సౌకర్యం లేకపోవడంతో ఎదుల్లబందం నుండి సిర్సా పాఠశాలకు కాలినడక వెళుతున్న విద్యార్థులు

పారుపల్లి వద్ద నూతనంగా నిర్మించిన కల్వర్ట్ వద్ద తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

కోటపల్లి, నవంబర్ 3 : కోటపల్లి మండలంలోని పారుపల్లి నుంచి వెంచపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు ఉంది. ఈ మార్గంలో లింగన్నపేట, ఎదుల్లబందం, సిర్సా, పుల్లగామ, రొయ్యలపల్లి, ఆలుగామ, జనగామ, సూపాక, నందరాంపల్లి గ్రామాలు ఉన్నాయి. గతంలో ఈ మార్గంలో ఆర్టీసీ సేవలు కొనసాగగా, రోడ్డు మరమ్మతుల కారణంగా బస్సు సేవలను పూర్తిగా నిలిపివేశారు. పారుపల్లి గ్రామం సమీపంలోని కల్వర్టు నిర్మాణంతోపాటు ఈ మార్గంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు బాగు అయినప్పటికీ ఆర్టీసీ సేవల పునరుద్ధరణ జరగకపోవడంతో పది గ్రామాల ఆడపడుచులకు ప్రైవేట్ వాహనాలే దిక్కుగా మారుతున్నాయి. ఈ మార్గంలో ఉన్న పది గ్రామాల ప్రజలకు ఆర్టీసీ సేవలు లేక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తెలియని పరిస్థితి.

సూపాక నుంచి చెన్నూర్‌కు రూ.100 చార్జీ

కోటపల్లి మండలంలోని పారుపల్లి నుంచి వెంచపల్లి మార్గంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాల యజమానులది ఇష్టారాజ్యంగా మారింది. సూపాక, వెంచపల్లి, జనగామ గ్రామాల నుంచి చెన్నూర్‌కు వెళ్లాలంటే ఒక్కరికి రూ.80 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. ప్రయాణికులకు గత్యంతరం లేక తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాల యజమానులు అడిగిన చార్జీ ఇస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఎనిమిది నెలలుగా ఈ మార్గంలో ప్రయాణికులు ఉచిత ఆర్టీసీ బస్సుకు నోచుకోక తమ గ్రామాలకు రానుపోను కలిపి ఒక్క రోజుకు రూ.200 వరకు ఖర్చు చేసుకుంటున్నా స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు పట్టించుకోవడం విమర్శలకు తావిస్తున్నది.

విద్యుత్ తీగలు సరిచేస్తే సేవలు పునరుద్ధరణ

కోటపల్లి మండలంలోని పారుపల్లి సమీపంలో ఒర్రెపై ఇటీవల కల్వర్టును నిర్మించారు. కల్వర్టు నిర్మాణంతో రోడ్డు ఎత్తు పెరగగా, విద్యుత్ తీగలు కిందకు రాగా, ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు నడిచినట్లయితే విద్యుత్ తీగలు బస్సును తాకే అవకాశం ఉంది. కానీ.. విద్యుత్ లైన్ ఎత్తు పెంచే విషయంలో ఆర్అండ్‌బీ, విద్యుత్ అధికారులు తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. విద్యుత్ లైన్ ఎత్తు పెంచేందుకు తాము విద్యుత్ సంస్థకు డబ్బులు చెల్లించామని ఆర్అండ్‌బీ అధికారులు చెపుతుండగా, విద్యుత్ లైన్ ఎత్తు పెంచేందుకు ఆ డబ్బులు సరిపోయేలా లేవని విద్యుత్ అధికారులు చెపుతున్నారు. రెండు శాఖల సమన్వయ లోపం ఈ మార్గంలో ఉన్న ఎనిమిది గ్రామాల ప్రజలకు శాపంగా మారుతున్నది.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం

కోటపల్లి మండలంలోని జనగామ రూట్‌లో ఆర్టీసీ సేవలు నిలిచిపోయిన విషయాన్ని స్థానిక నాయకులు, ప్రజలు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్డు బాగున్నా, చిన్న కారణాలతో బస్సును నడిపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యేకు చెప్పినా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమస్య చిన్నదైనప్పటికి పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఆర్టీసీ బస్సు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు చెపుతున్నారు. పారుపల్లి, సిర్సా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పై తరగతులు చదువుతున్న విద్యార్థులు బస్సు సౌకర్యం లేక కాలినడకన పాఠశాలలకు వెళ్లున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు చెపుతున్నారు. ఎమ్మెల్యే స్పందించి తమ గ్రామాలకు ఆర్టీసీ బస్సు నడిచేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ లైన్ సరి చేసేందుకు చర్యలు తీసుకుంటాం..

పారుపల్లి గ్రామం సమీపంలోని కల్వర్టు వద్ద విద్యుత్ లైన్ ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ లైన్ ఎత్తు పెంచేందుకు అవసరమైన డబ్బులను విద్యుత్ శాఖకు చెల్లించగా, వారు ఆ డబ్బులు సరిపోవని చెపుతుండడం వల్ల విద్యుత్ లైన్ అలానే ఉంది. ఈ విషయమై మళ్లి విద్యుత్ అధికారులతో మాట్లాడి లైన్ ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ***- భరత్, ఆర్అండ్‌బీ జేఈ.***

ఎనిమిది నెలల నుంచి బస్సే లేదు..

ఎనిమిది నెలల నుంచి మా ఊరికి బస్సు జాడే లేదు. బస్సులు లేక మా ఊరోళ్ళంతా ఆటోలు, జీబులలో చెన్నూర్‌కు వెళ్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ ప్రయాణం అని టీవీలలో చూసుడే తప్ప నేను ఒక్కరోజు కూడా బస్సుల పోలేదు. మా ఊరికి బస్సును నడిపితే మాతోపాటు మా చుట్టు పక్కల ఊరోళ్లు కూడా ఉచిత బస్సులో ప్రయాణం చేస్తాం. ***- జాడి లచ్చక్క, జనగామ.***

ఎమ్మెల్యే పట్టించుకోవాలి..

జనగామ రూట్‌లో బస్సు సౌకర్యం పునరుద్ధరణ కోసం ఎమ్మెల్యే పట్టించుకోవాలి. బస్సులు లేక ప్రైవేట్ వాహనాల్లో మహిళలు రోజుకు రూ.100 నుంచి రూ.200 వరకు ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. రోడ్డు మార్గం బాగున్నా బస్సు నడపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఎమ్మెల్యే దృష్టి పెట్టి మా మార్గంలో బస్సులను నడిపించి మాకు కూడా మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

- రావుల రాజేశ్వరి, రొయ్యలపల్లి.

రోడ్డు బాగు చేయిస్తే బస్సును నడుపుతాం..

కోటపల్లి మండలంలోని పారుపల్లి మార్గం రూట్ సరిగా లేక ఆర్టీసీ బస్సును నడపడం లేదు. చిన్న వర్షాలకు బస్సులు దిగబడడంతోపాటు పారుపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు దగ్గర విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండడం వల్ల ఆర్టీసీ బస్సు ఈ మార్గంలో నడపడం లేదు. పారుపల్లి నుంచి జనగామ రూట్‌లో ఉన్న విద్యుత్ లైన్ సరిచేయడంతోపాటు రోడ్డు మరమ్మతు చేయించినట్లయితే ఆర్టీసీ సేవలను పునరుద్ధరణ చేస్తాం.

- జనార్దన్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల.

తాండూర్: గురువులతో తాండూర్ జడ్పీహెచ్ఎస్ పూర్వవిద్యార్థులు

బాల్య స్నేహాన్ని పదిలంగా నిలుపుకుందాం

తాండూర్, నవంబర్ 3 : బాల్య స్నేహాన్ని కొనసాగించడం ద్వారా ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలున్నాయని ఉద్యోగ బాధ్యతల్లో బిజీ జీవితాన్ని గడిపేవారు బాల్య స్నేహాన్ని పదిలంగా కొనసాగించాలని పెద్దపల్లి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి రావూఫ్‌ఖాన్ తెలిపారు. ఆదివారం తాండూర్ మినీ సురభి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జడ్పీహెచ్ఎస్ 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రావూఫ్‌ఖాన్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలోని మధురానుభూతులను నెమరు వేసుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. భవిష్యత్తుకు పునాదులు వేసిన బాల్యం మధురస్మృతులను ఉపాధ్యాయులు స్నేహితుల మధ్య పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. బాల్యంలోని తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధిలో వెనకడుగు వేసేదేలేదు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఎస్ఆర్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 3 : మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధిలో వెనకడుగు వేసేదేలేదని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు(పీఎస్ఆర్) అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు సురేఖతో కలిసి మాట్లాడారు. రూ.300 కోట్లతో 650 పడకల సూపర్ స్పెషాలటీ ఆసుపత్రి నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆసుపత్రి నిర్మాణం ప్రారంభమైన రోజు నుంచి రెండేండ్లలో సేవలను అందుబాటులోకి తీసుకొస్తానని వెల్లడించారు. లేకుంటే దేనికైన సిద్ధం అని పేర్కొన్నారు. ఒక వేళ నిర్మాణం నిర్దేశిత సమయంలో పూర్తయితే ప్రతిపక్ష నాయకులు సన్యాసం తీసుకుంటారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఏకమవ్వలేదని, కాణిపాకం గణపతి ఆలయంలో ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. మంచిర్యాలకు కూడా త్వరలో హైడ్రా వస్తుందని, 150 గజాల లోపు ఇండ్లు కట్టుకున్న పేదల జోలికి వెళ్లమని, అంతకంటే ఎక్కువ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకున్న అక్రమార్కులను వదిలేదిలేదన్నారు. బఫర్ జోన్‌లో ఇండ్లు కోల్పోతున్న బాధితులు తనని కలిశారని, నిబంధనలకు లోబడి ఉంటే వారికి నష్ట పరిహారం ఇప్పించడంతోపాటు మొదటి విడుతలో వస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఇప్పించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, మంచిర్యాల వైస్ చైర్మన్ సల్ల మహేశ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి పాల్గొన్నారు.

కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే

నీసీసీ, నస్పూర్ 3 : నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు పటేల్ కాలనీలో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సందర్శించారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ సుర్మిల్ల వేణు, కౌన్సిలర్లతో కలిసి పటేల్ కాలనీలో సందర్శించారు. కాలనీలో రోడ్లు, మురికి కాలువలు నిర్మించాలని, వర్షాలతో వరద నీరు ఇండ్లలో చేరుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండారి సుధాకర్, నాయకులు చిట్ల సత్యనారాయణ, రమేశ్, ఖాలీద్, నరిగె నరేశ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.